అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బాలానగర్‌లో మౌలిక సదుపాయాల కల్పన
- 24 గంటల విద్యుత్ సరఫరా
- పరిశ్రమల యజమానులు, కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ


బాలానగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి బాలానగర్ డివిజన్ పరిధిలోని కులసంఘాలు, అపార్టుమెంట్ వాసులు, చిత్తారమ్మ డబుల్ బెడ్ రూమ్‌వాసులు, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్, విశ్వకర్మ సంఘం, భవన నిర్మాణ సంఘం, సీనియర్ సిటిజన్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలానగర్ వాసుల ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు రూ. 400 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టామని, ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో నిరుపేదలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం..

బాలానగర్ ప్రాంతంలో ఒకప్పుడు విద్యుత్ సమస్యలతో కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడేవారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. 24 గంటలు విద్యుత్ అందిస్తూ అటు పరిశ్రమల యజమానులకు, ఇటు కార్మికులకు ఇబ్బంది లేకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఎన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయో అర్థం చేసుకోవాలని, కర్ణాటక నాయకులు అక్కడ రైతులకు కేవలం ఐదు గంటలు విద్యుత్ అందిస్తున్నామని చెప్పడానికి తెలంగాణ వచ్చి అభాసుపాలయ్యారన్నారు. రైతులు, పరిశ్రమల యజమానులు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధిని గమనిస్తున్నారన్నారు. బాలానగర్‌లో ప్రతి గల్లీలో రోడ్లు, మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని, దిల్‌కుష్ నగర్ ప్రాంత వాసులకు రోడ్డు కష్టాలు తీర్చామన్నారు. ఇంద్రానగర్ ప్రాంతంలో రోడ్లు, విద్యుత్, మంచినీటి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్‌నాయకులు ఏనుగుల తిరుపతి, శాఖయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం మద్దతు...

కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు ఎంఐఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఎంఐఎం నాయకులు సమావేశమై కృష్ణారావుకు మద్దతు ప్రకటించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ముస్లిం, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేశారన్నారు. వారి కోసం అన్ని ప్రాంతాల్లో స్కూల్స్, హాల్స్, గ్రేవ్‌యార్డ్స్ నిర్మించి పెద్ద మనస్సు చాటుకున్నారని ఎంఐఎం నాయకులు అన్వర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకొని పరిష్కరించే కృష్ణారావును ముచ్చటగా మూడోసారి గెలిపిస్తామన్నారు.

సీఎం దూరదృష్టితోనే..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హైదరాబాద్ మహానగరంలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా అందరిని సొంత బిడ్డల్లా చూసుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గుర్తుంచుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపినందుకు పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.


వివిధ సంఘాల నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే




మాధవరం కృష్ణారావుకు మద్దతు తెలుపుతున్న ఎంఐఎం నేతలు

మాధవరం కృష్ణారావుకు ఆర్యవైశ్య సంఘం మద్దతు


మాట్లాడుతున్న మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అర్యవైశ్య సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. శనివారం అర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాంచందర్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ అర్యవైశ్య సంఘం తనకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అర్యవైశ్యుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, తనవంతుగా సంఘం అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న ఇలాంటి ఎమ్మెల్యే మనకు ఉండటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలని పేరు తెచ్చిన మాధవరం కృష్ణారావుకు స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అధ్వర్యంలో తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, మన్నే ఉదయ్‌యాదవ్, మేకల హరినాథ్, మల్లేష్‌యాదవ్ సంఘం నాయకులు మరళీకృష్ణ, ప్రభుగుప్త, పూర్ణచందర్, రాము, రమణ, నాగేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ప్రజాబంధు అభ్యర్థి మామిళ్ల ఆనంద్ నామినేషన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.శనివారం ఇండియా ప్రజాబంధు పార్టీకి చెందిన కూకట్‌పల్లి నియోజకవర్గ అభ్యర్థి మామిళ్ల ఆనంద్ నామినేషన్ దాఖలు చేశారు. కూకట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.



మాధవరం కృష్ణారావు గెలుపే ధ్యేయం


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు విజయం చేకూర్చాలని కోరుతూ కూకట్‌పల్లి గ్రామంలోని యాదవబస్తీ, శాంతినగర్ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి వారి అష్టవింశ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు జగద్గురు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామిలచే అష్టవింశ బ్రహ్మోత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మధ్యాహ్నం 12 గంటలకు తీర్థప్రసాదాలు అందించారు.

స్వరూపానందేంద్ర స్వామిని కలిసిన సీఎస్ శాంతికుమారి



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి జగద్గురు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వాములను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల అమ్మవారి వస్త్రాలను పీఠాధిపతుల చేతులమీదుగా ఆమె అందుకున్నారు.

నేడు బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాల బృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 'ఆటిట్యూడ్ ఆఫ్ గ్రాటిట్యూడ్' అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 9 ఏళ్ళ నుంచి 14 ఏళ్ళ లోపు విద్యార్థులు పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040 23001234లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో కళాకారుడు ఆర్.సుభాష్‌బాబు వేసిన చిత్రాలను ప్రొఫెషియన్సీ విత్ జిల్ పేరిట శనివారం చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను మాజీ మంత్రి ఎం.ఎం.పి.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తాయని కొనియాడారు. ఈనెల 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.

అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం తెలుగువన్.కామ్ రేడియో జాకి హిమబిందు ఆధ్వర్యంలో బిజిబెస్ లర్నింగ్ సెంటర్ ద్వారా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, స్తోత్ర పఠనం గురువులతో పాటు శిష్యులు సునిల్, విఖ్యాత్, ఇందిరా, మిహిర, తన్విక, సమయ, మీర, చక్రిక, అశ్విని, శ్రీరామచంద్ర తదితరులు పాల్గొని కీర్తనలను ఆలపించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సుమధుర సంగీత స్వరధార సంగీత విభావరి, తిల్లాన ఆర్ట్స్ అకాడమి గురువు మాధవి మారెళ్ళపూడి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో మంగళం, జయ జయ స్వామిన్, ఆండాల్‌కౌత్వం, నటనమాడిన, భరో కృష్ణయ్య,సింహాసన స్తుతి, కీర్తన, గోపబాల, తిల్లాన తదితర అంశాలను అభా, ఆస్మి, ఆర్య, అజ్ఞ, చేతన, సాయి, వేదాంశీ, సమృద్ధి, స్వేచ్ఛ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఓటమి ఖాయం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్, సత్యం శ్రీరంగం

కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్...



కూకట్‌పల్లి: మోసపూరిత పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ఓటమి ఖాయమని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. శనివారం ఆయన ఫతేనగర్ డివిజన్, ఇందిరాగాంధీ పురంలో డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు నియోజకవర్గ ప్రజల ఆత్మ గౌరవానికి, అధికార పార్టీ అహంకారానికి మధ్య జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఆత్మ గౌరవం వైపు నిలబడి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ప్రజలకు బీఆర్ఎస్ చేసింది శూన్యమన్నారు. మోసపూరిత పాలన చేస్తున్న బీఆర్ఎస్‌ను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం..

టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం హస్మత్‌పేట్, లైన్స్‌టౌన్ కాలనీ, హరిజనబస్తీ, షేర్‌గల్లీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి బండి రమేష్‌ను గెలిపించాలని కోరారు. బండి రమేష్ గెలుపుతో పేదల బతుకుల్లో వెలుగులు నిండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బండి రామక్రిష్ణ, కాకర్ల అరుణ, విజయలక్ష్మి, జ్యోతి, దండుగుల సందీప్, పి. అంజి, అనంద్, షాయిన్‌షా, కిరణ్‌గౌడ్, శ్రీను, శ్రీకాంత్, శ్రీరాములు, అమ్జద్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.


ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీ కార్యకర్తలకేనా పథకాలు.?

- బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ ధ్వజం


ఇందిరాగాంధీ పురంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



కూకట్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలన్నీ పార్టీ కార్యకర్తలు, నాయకులకే పరిమితమయ్యాయని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. శనివారం ఆయన ఫతేనగర్ డివిజన్ ఇందిరాగాంధీ పురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీకి ఇందిరాగాంధీ పేరు పెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరాగాంధీ పురం కాంగ్రెస్ అడ్డా అన్నారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఆయనకు మద్దతు తెలిపారు. అనంతరం 'బస్తీలో హస్తం మన నేస్తం... కాంగ్రెస్ పార్టీకే మన ఓటు'... అంటూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ అధినాయకత్వాన్ని ఒప్పించి ఆరు గ్యారంటీలను ప్రవేశపెట్టారన్నారు. బస్తీ వాసులు సమస్యలతో సతమతమవుతున్నారని, మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని ఆరోపించారు. పెన్షన్‌లు అందక పలువురు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనేక మందికి ఇళ్ల పట్టాలు లేవన్నారు. మంత్రి కేటీఆర్ తమ పార్టీ అనుచరులకు మాత్రమే పథకాలను వర్తింపజేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, ఎన్నికల ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రమేష్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, శాంతి, యూత్ నాయకులు వినయ్, కిరణ్, సీనియర్ నాయకులు రమేష్ బాబు, కంటెస్ట్ కార్పొరేటర్ రాజు ముదిరాజ్, యూసుఫ్, అజీద్, శంకర్, హమీద్‌ఖాన్, రవి, మధు, రాజు, పటేల్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కార్యకర్తలు మనోస్థైర్యాన్ని కోల్పోవద్దు

రవికుమార్‌యాదవ్


మాట్లాడుతున్న రవికుమార్ యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: బీజేపీ కార్యకర్తలు మనోస్థైర్యాన్ని కోల్పోవద్దని ప్రసార సాధనల్లో వస్తున్న తప్పుడు వార్తలు నమ్మవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు మనోస్థైర్యాన్ని కోల్పోవద్దని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీకే టికెట్ వస్తుందని బీజేపీ అభ్యర్థి పోటీలో ఉంటారని తెలిపారు. బూత్ కమిటీలను పూర్తి చేయాలని సూచిస్తూ, గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. శేరిలింగంపల్లి దేశంలోని పెద్ద నియోజవర్గమన్నారు. ఈ సీటును బీజేపీ వదులుకోవటానికి సిద్ధంగా లేదని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలోని పవన్‌కళ్యాణ్ అభిమానులు, సెటిలర్స్ కూడా బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, బీజేపీ నాయకులు, మహిళా మోర్చా, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి టికెట్ బీజేపీకే కేటాయించాలి


నిరాహార దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్ టికెట్ ఖచ్చితంగా బీజేపీ అభ్యర్థికే ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతూ శనివారం యువ మోర్చా, మహిళా మోర్చా ఆధ్వర్యంలో కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ కూకట్‌పల్లి టికెట్ బీజేపీకి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అద్వానీ సూర్యారావు, సూర్యప్రకాష్, శ్రీకర్‌రావు, శంకర్‌రెడ్డి, సునీల్ రెడ్డి, పద్మయ్య, డకయ్య,మల్లేష్ గౌడ్, బీజేపీ నాయకులు, మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక


ఎమ్మెల్యే మాధవరం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యడ్ల ప్రభాకర్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బండి రమేష్ శనివారం ప్రచారం నిర్వహిస్తున్న సమయంలోనే బాలానగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు యడ్ల ప్రభాకర్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పార్టీని వీడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు కొంత డీలా పడ్డారు. రెండురోజుల క్రితం బాలానగర్ ప్రాంతానికి చెందిన యూత్ నాయకులు రిషియాదవ్, బండారి నవీన్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఇదే బాటలో మరి కొందరు నేతలు పార్టీకి గుడ్ బై చెప్పనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీలకు నాయకులు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్‌తోనే కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బీజేపీ దళిత మోర్చా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బచ్చలి కమల్, యువ మోర్చా నాయకుడు ఉదయ్, కాంగ్రెస్ నేత బచ్చలి రాకేష్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చెందిందని, కళ్లముందు జరుగుతున్న అభివృద్ధి చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరామన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని ఇందుకు నిదర్శనమే బాలానగర్ ఫ్లై ఓవర్, బేగంపేట స్మశాన వాటిక, సీసీ రోడ్లు, మంచినీరు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎంతోమందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అభివృద్ధికి నిదర్శనంగా మారిన కృష్ణారావు ఆధ్వర్యంలో పనిచేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీలో చేరామని తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు...


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్ధతుగా శనివారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వివరిస్తూ ప్రచారం చేశారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లో పార్కులు, ఇండోర్ స్టేడియాలు, మౌలిక వసతులు, 24 గంటల విద్యుత్ సహా శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రశాంతంగా జీవిస్తున్నామని ఇది గమనించి తిరిగి అభివృద్ధికే పట్టం కట్టాలని ప్రజలను కోరారు. రాబోయే ఎన్నికల్లో కేపీహెచ్‌బీ డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ ఎమ్మెల్యే కృష్ణారావును గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, సాయిబాబా చౌదరి, నారాయణరాజు, మాజీ కౌన్సిలర్ ధనలక్ష్మీ, రాజేష్, సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, కట్టా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.